www.nagaranijam.com
PRGI/RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు :
☎ 82474 67562
Email Id : nagaranijam@gmail.com

నగరనిజం
www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక



| సంపుటి : 14 | సంచిక : 76 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 8,సోమవారం,జూన్, 2026 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 14 | Issue : 76 | Rangareddy | Editor : Aela.Purushotham | 8,Monday,June,2026 | Pages : 4+ | Price : 3/- |

Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

# మూసీ ప్రక్షాళన ఫేజ్-2కు వంద రోజుల్లో శ్రీకారం: ఏ.రేవంత్ రెడ్డి





ఉప్పల్, 7 జూన్ (నగర నిజం) : మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా నాగోల్ నుంచి గౌరెల్లి వరకు చేపట్టనున్న మూసీ ప్రక్షాళన ఫేజ్-2 పనులను వంద రోజుల్లో ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు తొలి దశ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పుడు రెండో దశకు కార్యాచరణ ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్ ఫేజ్-3లో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ. 98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం రూ. 1,511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. రూ. 960 కోట్లతో ఏటీసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం, రూ. 416 కోట్లతో టీకేఆర్ కళాశాల జంక్షన్ వద్ద ఆరు వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం, రూ. 37.50 కోట్లతో 100 పడకల జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన సభలో కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ ఆధారంగా రూపొందించిన "క్యూర్-1" యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర అభివృద్ధికి మూసీ ప్రక్షాళన అత్యవసరమని, మెట్రో విస్తరణ, పరిపాలనా వికేంద్రీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను వివరించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా చెప్పుకోవడం మాత్రమే కాకుండా ఆ స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నగరంలోని అన్ని దిశల్లో 122 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ ఆస్పత్రి మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు, అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రోను విస్తరిస్తామని వెల్లడించారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ ప్రక్షాళన వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరిన ముఖ్యమంత్రి, రాష్ట్రం నుంచి కేంద్రంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు కూడా మద్దతు ఇవ్వాలని సూచించారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్తరప్రదేశ్‌లో గంగా ప్రక్షాళన చేపట్టినప్పుడు మూసీ నది ప్రక్షాళన ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని అభివృద్ధి చేస్తే నగర సౌందర్యం పెరగడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు తీవ్రమైన కాలుష్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు, ఇతర కాలుష్య కారకాల వల్ల నల్గొండ జిల్లా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ సమస్యతో పాటు మూసీ కాలుష్యం కూడా ఆ ప్రాంత ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఏ పేదవారికి అన్యాయం జరగదని, ఎవ్వరినీ నిరాశ్రయులుగా చేయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అవసరమైతే ఇళ్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ గృహాలు కల్పించి, వారి పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా ఓఆర్ఆర్ లోపలి 2100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని "క్యూర్" ప్రాంతంగా గుర్తించామని తెలిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కార్పొరేషన్లుగా వికేంద్రీకరణ చేపట్టినట్లు వెల్లడించారు. ఇదే తరహాలో పోలీసు వ్యవస్థను కూడా విభజించినట్లు చెప్పారు. మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న సమయంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయానని పేర్కొన్న ముఖ్యమంత్రి, ఇప్పుడు ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు ప్రభుత్వం



అందిస్తుందని, అవసరమైన అనుమతులు వేగంగా మంజూరు చేస్తామని తెలిపారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

# డీసీఏ తనిఖీల్లో 41 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు



హైదరాబాద్, 7 జూన్ (నగర నిజం) :తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ఫార్మసీలతో అనుబంధంగా పనిచేస్తున్న మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించింది. జూన్ 6న చేపట్టిన ఈ ప్రత్యేక అమలు చర్యల్లో మొత్తం 166 మెడికల్ షాపులను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీ చేసిన దుకాణాల్లో 159 మెడికల్ షాపులు ఆన్‌లైన్ ఔషధాల సరఫరా సేవలకు అనుబంధంగా ఉండగా, మరో 7 దుకాణాలు ఆన్‌లైన్ బీ2బీ వేదికలతో సంబంధం కలిగి ఉన్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. మందుల విక్రయాలకు సంబంధించిన బిల్లులను నిర్వహించకపోవడం, అవసరమైనప్పుడు వాటిని చూపించలేకపోవడం, ప్రిస్క్రిప్షన్ మందుల రిజిస్టర్లు, షెడ్యూల్ హెచ్-1 మందుల రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, కొనుగోలు ఇన్వాయిస్‌లను సమర్పించకపోవడం వంటి లోపాలను గుర్తించారు. అలాగే నమోదు పొందిన వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయించడం, నమోదు పొందిన ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా మందుల విక్రయాలు నిర్వహించడం, కొనుగోలు-అమ్మకాల రికార్డులను సరిగా నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలు కూడా బయటపడ్డాయి. ఈ ఉల్లంఘనల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 41 మెడికల్ షాపులకు డీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940 నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఆన్‌లైన్ ఫార్మసీలతో అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులు సహా అన్ని ఔషధ దుకాణాలు చట్టబద్ధ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీసీఏ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణ, బాధ్యతాయుతంగా మందుల విక్రయాల నిర్వహణ, ఔషధ సరఫరా వ్యవస్థలో నిబంధనల అమలు కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతాయని డీసీఏ వెల్లడించింది.

# ఉప్పల్‌లో ఎస్ఎస్‌కే పట్కర్ ప్రాంతీయ సమాజ్ భవనం ప్రారంభం



ఉప్పల్, 7, జూన్ (నగర నిజం) :ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ (ఎస్ఎస్‌కే) పట్కర్ (ఖత్రి) ప్రాంతీయ సమాజ్ (తెలంగాణ) భవనాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సమాజ్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో భవనాన్ని ప్రారంభించి ముఖ్యమంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సామాజిక భవనాలు కేంద్రాలుగా మారాలని, వివిధ వర్గాల ప్రజల ఐక్యతకు ఇటువంటి భవనాలు దోహదపడతాయని పేర్కొన్నారు. సమాజ సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు, సమాజ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. భవనం నిర్మాణానికి సహకరించిన వారిని నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి సమాజ్ సభ్యులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# 'హైడ్రా' హంతక ముఠాలాంటిది

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 7 (నగరనిజం): ప్రపంచంలోనే అత్యంత క్రూరు డైన నియంత హిట్లర్ ఆదర్శం కాబట్టే రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ ఏర్పాటుచేసిన 'హైడ్రా' ఓ హం తక ముఠా లాంటిదని, సీఎం నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం ఇప్పుడు దేశానికి అర్థమైందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి వైఖరిని కాంగ్రెస్ హైకమాండ్ సమర్థిస్తుందా? సమాధానం చెప్పాలని స్పష్టం చేశారు. మాకు అంబేద్కర్, మహాత్మాగాంధీ, జయశంకర్ సార్ ఆదర్శమని, మా పదేండ్ల పాలన రాజ్యాంగ స్ఫూర్తితో సాగిందని, మీలాగా హిట్లర్ వంటి నియంతృత్వ చర్యలతో కాదని వివరించారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వ పోకడల పై తెలంగాణ సమాజం తిరగబడే రోజు లు దగ్గర్లోనే ఉన్నాయని, 'హిట్లర్ హటా వో.. తెలంగాణ బచావో' పోరాటం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. బెంగుళూ రు వేదికగా జరిగిన 'ది హిందూ' సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆదివారం ఎక్స్‌వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం ఏర్పాటుచేసిన 'హైడ్రా' సంస్థకు, దాని పనితీరుకు జర్మనీ నియంత ఆడాల్ఫ్ హిట్లర్ చర్యలే స్ఫూర్తి అని ముఖ్యమంత్రి బహిరంగంగా ఒప్పుకోవడంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి నిరంకుశ, ఫాసిస్ట్ మనస్తత్వం ఇప్పు డు దేశం మొత్తానికి అర్థమైందని ఎద్దేవా చేశారు. సీఎం వైఖరిని నిలదీస్తూ, కోట్ల మందిని ఊచకోత కోసిన క్రూరుడు, నరరూప రాక్షసుడైన హిట్లర్ నీకు రోల్ మోడలా అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. మొత్తం మానవజాతి చరిత్రలోనే అతిపెద్ద నరమేధం సృష్టించిన 'హిట్లర్ నీకు ఆదర్శం' అని చెప్ప డానికి సిగ్గనిపిస్తలేదా అని దుయ్యబట్టారు. 'మొన్న ప్రజా పాలన అన్నవు. నిన్న ఇందిరమ్మ పాలన అన్న వు. నేడు నేరుగా హిట్లర్ పాలన అని ఒప్పుకున్నావు' అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'రెండున్నరేళ్ల నీ రాక్షస పాలన ఆనవాళ్లు నిజంగానే హిట్ల ర్ ఆరాచకాన్నే తలపించాయి. ఇవి యుద్ధం మిగిల్చే విషాదాల్నే మించిపోయాయి' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా నుంచి మూసీ వరకు, లగచర్ల నుంచి వెలుగుమట్ల వరకు పేదలపై విరుచుకుపడిన 'నీ బుల్డోజర్లు నయా నాజీ పాలనకు నిజమైన సా క్ష్యాలు' అని కేటీఆర్ అభివర్ణించారు. పదేళ్లు సంతోషంగా ఉన్న తెలంగాణను సంక్షోభాల పాతాళంలోకి నెట్టిన నాడే 'నీ నియంత పోకడలు బయటపడ్డాయి' అని మండిపడ్డారు. 'విధ్వంసమే నీ విధానమని, వి కాసం అంటే నీకు తెలియదని, ఇంత నిర్లజ్జగా ఒప్పుకున్న నువ్వు ఒక రాష్ట్రానికి సీఎంగా ఉండటం రా జ్యాంగ వ్యవస్థకే అత్యంత ప్రమాదకరం' అని హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక నియంతను నిలువెత్తు కీర్తించే నీ దుర్మార్గమైన మనస్తత్వం స్వతం త్ర భారతావనిలోనే ఓ చీకటి అధ్యా యమన్నారు. ఈ వీరోచిత పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో ఎందరో నియంతలకు నూకలు చెల్లాయని, రాష్ట్ర గ్రామగ్రామాన లేచిన ఉక్కుపిడికిళ్లు వారిని పొలిమేరల దాకా తరిమికొట్టాయని కేటీఆర్ గుర్తుచేశారు. తలకెక్కిన అధికారంతో విర్రవీగిన హిట్లర్‌కు ఆనాడు ఏ గతి పట్టిందో, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల చేతిలో రేవంత్‌రెడ్డి పాలనకు అదే గతి పట్ట డం ఖాయమని స్పష్టం చేశారు. 'మీకు స్ఫూర్తి హిట ర్.. ముమ్మాటికీ నిజమే'నని, రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన 'హైడ్రా' ఒక అస్సాసినేషన్ ఏజెన్సీ (హంతక ముఠా) లాంటిదన్నారు.

# వంజరి కుల ఆత్మగౌరవ భవనం ప్రారంభించిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి



ఉప్పల్, 7 జూన్ (నగర నిజం) :ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవనాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. వంజరి సమాజ అభివృద్ధి, సామాజిక ఐక్యతకు ఈ భవనం కేంద్రంగా నిలవాలని ఆకాంక్షిస్తూ భవనాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆత్మగౌరవ భవనాలు ఆయా వర్గాల సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు వేదికలుగా ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వంజరి సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. భవనం ప్రారంభం సందర్భంగా హర్షాతిరేకాల మధ్య ముఖ్యమంత్రి సహా అతిథులకు సంఘ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# హయత్ నగర్‌లో సాంక్టస్ వరల్డ్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం





**హయత్ నగర్, 7, జూన్ (నగర నిజం)** :హయత్ నగర్ పరిధిలోని కుంట్లూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా ఏర్పాటు చేసిన సాంక్టస్ వరల్డ్ స్కూల్ నాలుగో బ్రాంచ్‌ను ఫిన్‌లాండ్ కౌన్సిల్ జనరల్ ఎరిక్ ఏ ఎఫ్ హాల్ స్ట్రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎరిక్ ఏ ఎఫ్ హాల్ స్ట్రామ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యా విధానంగా గుర్తింపు పొందిన ఫిన్నిష్ విద్యా నమూనా ఆధారంగా భారతీయ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సాంక్టస్ వరల్డ్ స్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులపై కేవలం చదువుల భారం మోపకుండా ఆటలు, శారీరక దృఢత్వం, సృజనాత్మకత పెంపొందేలా ఈ విధానం దోహదపడుతుందని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణను మనోవిజ్ఞాన శాస్త్రంతో అనుసంధానిస్తూ బోధన సాగించాల్సిన అవసరం ఉందన్నారు.పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఫిన్నిష్ పాఠ్య విధానాన్ని భారతీయ విద్యా వ్యవస్థకు అనుగుణంగా మార్పులు చేసి విద్యార్థులకు బోధిస్తున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి గదిలో కృత్రిమ మేధస్సు ఆధారిత ఇంటరాక్టివ్ ఎల్ఈడీ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా ఉపాధ్యాయులు శ్రవణ-దృశ్య పద్ధతిలో డిజిటల్ పాఠ్యాంశాలను బోధించనున్నట్లు తెలిపారు.పాఠశాలలో గ్రంథాలయం, అధునాతన కంప్యూటర్ ప్రయోగశాల, సంగీతం, నృత్య గదులు, మల్టీమీడియా విభాగం, కుండల తయారీ ప్రయోగశాల వంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.స్కూల్ నిర్వాహకులు రాజేశ్వర్ రెడ్డి, హనుమంతు రెడ్డి మాట్లాడుతూ మొత్తం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒక ఎకరాన్ని విద్యా బోధనకు కేటాయించి, మిగిలిన మూడు ఎకరాలను క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇందులో ఈత కొలను, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, అథ్లెటిక్ ట్రాక్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, పికిల్‌బాల్ సహా దాదాపు 20 రకాల ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ప్రస్తుతం తొలి విద్యా సంవత్సరంలో 50 మంది శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో విద్యాబోధన ప్రారంభించినట్లు యాజమాన్యం తెలిపింది. శంషాబాద్, బీఎన్ రెడ్డి నగర్, కోకాపేటల తర్వాత కుంట్లూరులో ప్రారంభించిన ఈ నాలుగో బ్రాంచ్ స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కళ్లెం ప్రభాకర్ రెడ్డి, ప్రముఖులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# మల్లాపూర్‌లో ఘనంగా నర్సింగ్‌రావు-రజిని దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు





**మల్లాపూర్ జూన్ 07 (నగర నిజం)** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమక్షంలో జువ్వాడ నర్సింగ్‌రావు - రజిని దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేయగా, కార్యకర్తలు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. నర్సింగ్‌రావు, రజిని దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జువ్వాడ అభిమానులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా సాగగా, హాజరైన వారందరికీ నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## రేవంత్ 'హిట్లర్' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం**
- **మీకు హిట్లరే స్ఫూర్తి అంటూ ఎద్దేవా**
- **మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా అని విమర్శ**
- **తమ పాలన అంబేద్కర్, గాంధీ ఆశయాలకు అనుగుణమని వెల్లడి**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డికి హిట్లరే స్ఫూర్తి అని, ఆయన నియంతలను పూజిస్తారని ఆరోపించారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు."మీ స్ఫూర్తి హిట్లర్! మీ హంతక ఏజెన్సీ పేరు హైడ్రా! మీరు నియంతలను పూజిస్తూ, కూల్చివేతల గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు" అని కేటీఆర్ తన పోస్టులో ఘాటుగా విమర్శించారు. "మేం మీ అంత తెలివైన వాళ్లం కాదు రేవంత్! అందుకే మేం అంబేద్కర్ రాజ్యాంగం, గాంధీజీ దార్శనికత, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పాలించాం" అనిపేర్కొన్నారు. నిన్న బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, హైడ్రా పేరు వెనుక తనకు స్ఫూర్తి హిట్లర్ అని వెల్లడించారు. హిట్లర్ కు హైడ్రా అనే టీమ్ ఉండేదని, హిట్లర్ ప్రత్యర్థుల పనిబట్టడమే ఆ టీమ్ పని అని పేర్కొన్నారు. రేవంత్ చేసిన ఈ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది.

# చదువు పూర్తయ్యాక సర్టిఫికెట్లు ఇవ్వని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- **హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలి**
- **తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి డిమాండ్**



**హైదరాబాద్, జూన్ 07**రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కార్పొరేట్ శక్తుల చేతిలో బందీగా మారింది. విద్యను సామాజిక బాధ్యతగా చూడాల్సిన యాజమాన్యాలు, దానిని వ్యాపార సామ్రాజ్యంగా మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాయని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి తీవ్ర స్థాయిలో బిమర్శించారు. అత్యున్నత న్యాయస్థానాల ఆదేశాలను బేఖాతరు చేస్తూ, విద్యార్థులను వేధించడం, చదువు పూర్తి కాగానే సర్టిఫికెట్లు నిలిపివేయడం ఈ విద్యా మాఫియాకు పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు.

**డొనేషన్ల పేరుతో పట్టపగలే దోపిడీ:**

ప్రసిద్ధ విద్యా సంస్థలమని, టాప్-10, టాప్-20 కాలేజీలమని సంకలు కొట్టుకుంటున్న బిటెక్ కాలేజీలు, ప్రతి సీటుకు ఏకంగా రూ. 10 లక్షల నుండి రూ. 30 లక్షల వరకు డొనేషన్లువసూలు చేస్తూ పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్నాయని అసరోపించారు. విద్యార్థుల ప్రతిభ కంటే, వారి తల్లిదండ్రుల ఆర్థిక స్తోమతకే ఇక్కడ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ దారుణమైన దోపిడీని ఎవరూ పట్టించుకోకపోవడం, ప్రభుత్వం మౌనంగా ఉండటం అత్యంత దురదృష్టకరమన్నారు.

**ప్రభుత్వానికి హెచ్చరిక:**

ప్రభుత్వం కేవలం నోటీసులతో సరిపెట్టకుండా, బాధ్యులైన విద్యా మాఫియాపై ఉక్కుపాదం మోపాలి. ఈ దోపిడీ ఆగకపోతే, రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల గుట్టు రట్టు చేసే విధంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రాంకోటి హెచ్చరించారు.

# గిరిజన గురుకులానికి టెండర్ల ఆహ్వానం


- **ఆహార పదార్థాలు, క్యాటరింగ్, శానిటేషన్ సేవల కోసం దరఖాస్తుల స్వీకరణ**

**మేడ్చల్, జూన్ 7 (నగర నిజం):**మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట మున్సిపల్ పరిధి సోమారం గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయానికి 2026-27 విద్యా సంవత్సరానికి అవసరమైన ఆహార పదార్థాలు, వివిధ సేవల సరఫరా కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ మమత ఒక ప్రకటనలో తెలిపారు.గురుకుల విద్యాలయానికి అవసరమైన కూరగాయలు, పాలు, పండ్లు, స్కిన్‌లెస్ చికెన్, మటన్ సరఫరాతో పాటు క్యాటరింగ్ సేవలు, స్వీపింగ్, శానిటేషన్ నిర్వహణకు సంబంధించి టెండర్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.టెండర్ దరఖాస్తు ఫారం ధర రూ.2,000గా నిర్ణయించగా, సాధారణ వర్గాల వారికి అడ్వాన్స్ డిపాజిట్ రూ.30,000గా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 40 శాతం రాయితీ కల్పించి అడ్వాన్స్ డిపాజిట్ మొత్తాన్ని రూ.18,000గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) రూపంలో దరఖాస్తు ఫారంతో జతచేసి ఈ నెల 15వ తేదీ వరకు గురుకుల విద్యాలయంలో సమర్పించాలని సూచించారు.పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అందజేయాలని, అనంతరం జూన్ 17న జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో టెండర్లను తెరవనున్నట్లు తెలిపారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా ముందస్తు నోటీసు లేకుండానే టెండర్ ప్రక్రియను వాయిదా వేసే పూర్తి అధికారం జిల్లా అదనపు కలెక్టర్‌కు ఉంటుందని పేర్కొన్నారు.ఆసక్తి గల కాంట్రాక్టర్లు, సరఫరాదారులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ మమత కోరారు. గురుకుల విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ టెండర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశ్యమని ఆమె తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి ఆహ్వానం



**కుత్బుల్లాపూర్, 7 జూన్ (నగర నిజం ప్రతినిధి):** ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు జాలిగం రాకేష్ ను ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పిడ మూర్తి రవి మరియు నిర్వహణ కమిటీ సభ్యులకు జాలిగం రాకేష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల త్యాగాలు, సేవలను స్మరించుకుంటూ వారి హక్కులు, సంక్షేమం మరియు భవిష్యత్ అభివృద్ధి అంశాలపై ఈ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.రాష్ట్ర సాధనలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించాలనే లక్ష్యంతో ఈ సమ్మేళనం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే దిశగా ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చివరగా "జై తెలంగాణ.. జై జై తెలంగాణ" అంటూ తన సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.



# శ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణానికి సహకారం అందించిన జాలిగం రాకేష్





**కుత్బుల్లాపూర్, 7 జూన్ (నగర నిజం ప్రతినిధి):** 131వ డివిజన్ గణేష్ నగర్, చింతల్‌లోని శ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్ గారిని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనుల పురోగతి గురించి కమిటీ సభ్యులు ఆయనకు వివరించారు.దేవాలయం భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించిన జాలిగం రాకేష్ గారు, తన వంతు సహకారంగా దేవాలయ అభివృద్ధి నిధులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా జాలిగం రాకేష్ గారు మాట్లాడుతూ, దేవాలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు కేంద్రబిందువులుగా నిలుస్తాయని అన్నారు. భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డబ్బులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు శరత్ కుమార్ గౌడ్, నరసింహారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, కుమారస్వామి, ప్రసాద్ గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక మహిళనే వేధిస్తున్న సర్పంచ్.. గ్రామాన్ని ఎలా పాలిస్తాడు?

- అధికార దుర్వినియోగంతో బాధితురాలిపై కక్షసాధింపు.. చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేశారు
- "మహిళపై కక్ష.. అధికారాన్ని ఆయుధంగా మార్చుకున్న సర్పంచ్!"
- "సొంత స్థలంలో ఇల్లు కట్టనివ్వకుండా వేధింపులు.. సర్పంచ్‌పై సీపీఎం ఫైర్!"



- "ఒక మహిళను టార్గెట్ చేసిన సర్పంచ్.. అధికార దుర్వినియోగంపై ఆగ్రహం!"
- "అధికార అహంకారానికి బలవుతున్న మహిళ.. సర్పంచ్ తీరుపై తీవ్ర విమర్శలు!"

వలిగొండ, జూన్ 7: ( నగర నిజం)ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ఓ గ్రామ సర్పంచ్ వ్యక్తిగత కక్షలతో ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్నాడని సీపీఎం నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు గ్రామానికి చెందిన బూడిద మణెమ్మ అనే మహిళ తన సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి కోరినా, ఉద్దేశపూర్వకంగా పర్మిషన్ ఇవ్వకుండా నాలుగేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు.మహిళా సంఘం భవనం నిర్మాణం పేరుతో ఆమె స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి వివాదాన్ని సృష్టించారని, అనంతరం ఆమె ఇంటి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్, నీటి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్‌లను ధ్వంసం చేయించడంతో పాటు ఇంటి చుట్టూ ఏర్పాటు చేసిన రేకులను కూడా తొలగించారని ఆరోపించారు.ఈ ఘటనపై ఆరా తీసేందుకు వెళ్లిన సీపీఎం నాయకుల బృందంపైనే తప్పుడు ప్రచారం చేస్తూ, "కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు" అంటూ ప్రజలను, మహిళలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు."ఒక మహిళకు న్యాయం చేయలేని సర్పంచ్ గ్రామ ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడు?" అని సీపీఎం నాయకులు ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజాసేవకు కాకుండా కక్షసాధింపుకు ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని బాధిత మహిళకు రక్షణ కల్పించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి మహిళకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు కోరారు.

# ఆడివ్--2026 ఘనంగా ఫేర్వెల్ వేడుక







**ఎల్బీనగర్, 7 జూన్ (నగర నిజం) :** సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) పూర్తి చేసిన విద్యార్థుల కోసం "ఆడివ్--2026" పేరుతో ఘనంగా ఫేర్వెల్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమం భావోద్వేగభరిత వాతావరణంలో సాగగా, విద్యార్థుల భవిష్యత్ వృత్తి జీవితానికి మార్గనిర్దేశం చేసేలా పలువురు విద్యావేత్తలు ప్రసంగించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ జి. నాగయ్య మాట్లాడుతూ, కార్పొరేట్ రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, నైతిక విలువలతో కూడిన నాయకత్వానికి ప్రస్తుతం అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఎంబీఏ డిగ్రీ కేవలం మంచి ఉద్యోగాలకు మార్గం మాత్రమే కాదని, సమాజ బాధ్యతను గుర్తించి వ్యాపారాలను సమర్థంగా నడిపించే నాయకులను తీర్చిదిద్దే సాధనమని పేర్కొన్నారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కవిత మాట్లాడుతూ, విద్యార్థులు విద్యా రంగంలో చూపిన ప్రతిభతో పాటు వివిధ నిర్వహణ ఉత్సవాలు, సంస్థ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యను అందించడంలో సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని చెప్పారు. నిరంతర అభ్యాసం, జట్టు భావన, సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం కార్పొరేట్ ప్రపంచంలో విజయానికి కీలకమని సూచించారు.విజయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రతాప్ విద్యార్థులకు వృత్తి జీవితంలో నెట్‌వర్కింగ్, పరిస్థితులకు అనుగుణంగా మారే నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. వాస్తవ ప్రపంచం విశ్లేషణాత్మక సామర్థ్యంతో పాటు భావోద్వేగ మేధస్సును కూడా పరీక్షిస్తుందని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.పరిపాలన అధికారి వి. శ్రీవాణి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ సందర్భంగా జూనియర్ ఎంబీఏ విద్యార్థులు సంగీత ప్రదర్శనలు, నృత్యాలు, సీనియర్ విద్యార్థుల కళాశాల జీవితంలోని మధుర జ్ఞాపకాలను ప్రతిబింబించే వీడియో ప్రదర్శనలతో సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకునేలా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ అధ్యాపకులు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిసింది.








# మృగశిర కార్తి వేళ చెరువుల వద్ద సందడి..

- చేపల వేటలో ముదిరాజులు, జాలర్ల హోరు
- వర్షాకాలానికి స్వాగతం పలుకుతూ పలు గ్రామాల్లో సంప్రదాయ చేపల వేట..

**పండుగ వాతావరణంలో గ్రామస్తుల సంబరాలు**



**మేడ్చల్ జూన్ 7 (నగర నిజం):**మృగశిర కార్తి సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటల,వద్ద సందడి వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము నుంచే ముదిరాజులు, జాలర్లు, యువకులు, రైతులు పెద్ద సంఖ్యలో చెరువుల వద్దకు చేరుకుని చేపల వేటలో పాల్గొన్నారు. సంప్రదాయ వలలను విసురుతూ గంటల తరబడి శ్రమించి చేపలను పట్టుకున్నారు. చెరువుల్లో పట్టుబడిన భారీ చేపలను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.మృగశిర కార్తి అనగానే తెలంగాణ ప్రజలకు చేపలు గుర్తుకొస్తాయి. వర్షాకాలం ప్రారంభానికి సంకేతంగా భావించే ఈ కార్తి రోజున చేపలు తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందనే నమ్మకం తరతరాలుగా కొనసాగుతోంది. అందుకే ప్రతి గ్రామంలో చేపల వేట, చేపల కొనుగోళ్లు, చేపల వంటకాలతో ప్రత్యేక సందడి కనిపించింది.

## మృగశిర కార్తి విశిష్టత

జ్యేష్ఠ మాసంలో వచ్చే మృగశిర నక్షత్రంతో ప్రారంభమయ్యే ఈ కార్తికి తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. రైతాంగం వ్యవసాయ పనులకు సిద్ధమయ్యే ఈ కాలంలో ప్రకృతి కొత్త శోభను సంతరించుకుంటుంది. ఎండల తీవ్రత తగ్గి, వర్షాలు ప్రారంభమయ్యే సమయంగా మృగశిర కార్తిని భావిస్తారు. అందుకే ఈ రోజును శుభప్రదంగా భావించి ప్రజలు ప్రత్యేక ఆహార పదార్థాలను తీసుకుంటారు.చేపల్లో సమృద్ధిగా ఉండే ప్రోటీన్లు, ఖనిజ లవణాలు, విటమిన్లు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే శక్తిని చేపలు అందిస్తాయనే విశ్వాసం ప్రజల్లో బలంగా ఉంది.

## ముదిరాజులు, జాలర్ల సంప్రదాయం

చెరువులు, కుంటలు, జలాశయాలతో జీవన అనుబంధం కలిగిన ముదిరాజులు, జాలర్ల సమాజానికి మృగశిర కార్తి ప్రత్యేకమైన రోజు. తరతరాలుగా చేపల వేటను వృత్తిగా కొనసాగిస్తున్న వీరు నీటి స్వభావాన్ని గుర్తించడం, చేపల సంచారాన్ని అంచనా వేయడం, వలలు అల్లడం వంటి అంశాల్లో ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగి ఉంటారు.మృగశిర కార్తి రోజున చెరువుల్లోకి దిగి సామూహికంగా చేపల వేట నిర్వహించడం వారి సంప్రదాయంలో భాగంగా కొనసాగుతోంది. పెద్దలు, యువకులు కలిసి వలలు లాగుతూ చేపలను పట్టుకోవడం, పట్టుబడిన చేపలను గ్రామస్తులతో పంచుకోవడం సామాజిక ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. యువతకు చేపల వేటలోని మెళకువలను నేర్పిస్తూ తమ సంప్రదాయాన్ని తదుపరి తరాలకు అందిస్తున్నారు.

## చేపల మార్కెట్లలో రద్దీ

మృగశిర కార్తి సందర్భంగా చేపల మార్కెట్లు కూడా కిటకిటలాడాయి. సాధారణ రోజుల కంటే చేపల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. చెరువుల్లో పట్టుబడిన తాజా చేపలకు మంచి డిమాండ్ ఏర్పడటంతో మత్స్యకారులకు, చేపల వ్యాపారులకు మంచి ఆదాయం లభించింది. గ్రామీణ ప్రాంతాల నుంచి సమీప పట్టణాలకు కూడా చేపల సరఫరా పెరిగింది.

## గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టిన వేడుక

మృగశిర కార్తి సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన చేపల వేట గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు కలిసి చెరువుల వద్ద గుమికూడి చేపల వేటలో పాల్గొనడం ద్వారా సామాజిక బంధాలు మరింత బలపడ్డాయి. వలలు లాగుతూ, చేపలను పంచుకుంటూ ఆనందాన్ని పంచుకున్న గ్రామస్తులు మృగశిర కార్తి విశిష్టతను మరోసారి చాటిచెప్పారు."మృగశిర కార్తి వస్తే చేపల వేట సందడి.. చెరువుల వద్ద పండుగ వాతావరణం.. ముదిరాజులు, జాలర్ల జీవన సంస్కృతి వెల్లివిరుస్తుంది" అని స్థానికులు పేర్కొన్నారు. వర్షాకాలానికి స్వాగతం పలుకుతూ చేపల వేటతో గ్రామాల్లో నెలకొన్న ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది.

# ఉత్తరాల ఉద్యమం.. వెలుగుమట్లలో సంపూర్ణ వెలుగుకై మహా ర్యాలీని జయప్రదం చేయండి




**ఖమ్మం: ( నగరం నిజం బ్యూరో) జూన్ 7:** వెలుగుమట్ల భూదాన భూమిలో ప్రభుత్వం కూల్చిన ప్రతి ఇంటిని అదే స్థలములో ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు . రాష్ట్రపతి , ప్రధానమంత్రి , రాహుల్ గాంధీ , తెలంగాణ గవర్నర్ , తెలంగాణ ముఖ్యమంత్రి గార్లకు బాధితులు ఉత్తరాల ద్వారా విన్నవించేందుకు రేపు అనగా సోమవారం ఉదయం 9:00 గంటలకు పెల్లింగ్ గ్రౌండ్ నుండి జెడ్పి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వరకు మహా ర్యాలీని నిర్వహించేందుకు వట్టే ఉదయ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగినది . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకంటి రాంబాబు హాజరై మాట్లాడారు . వెలుగుమట్ల భూదాన భూమిలో గత పదేళ్లుగా నివాసం ఉంటున్న పేద ప్రజలపై రేవంత్ రెడ్డి రాజ్యం చేసిన క్రూరత్వం అందరికీ తెలిసినదే . బాధితులు మరియు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన విరోచితమైన ఉద్యమం మహా ధర్నా నిరాహార దీక్షల ఫలితంగా ప్రభుత్వం ఆ వెలుగుమట్లలోనే 311 మందికి ఇళ్ల పట్టాలి ఇచ్చిన విషయం అందరికీ తెలిసినదే అదే ప్రభుత్వం 729 ఇల్లు కూల్చి 311 మందికే ఇవ్వటం మళ్లీ బాధితులని మోసం చేయడమేనని అన్నారు . రోడ్డునుబడ్డ ఇంకా 500 మంది బాధితులు రాజ్యాంగ బద్ధంగా ఆయా పద్ధతుల్లో ఉద్యమాలు నిర్వహిస్తూనే ఉన్నారు . రెవిన్యూ మంత్రి మరియు గవర్నర్ ను కూడా కలిసి వారి బాధను విన్నవించుకున్నారు . అదే సందర్భంలో రాష్ట్రపతి కి ప్రధానమంత్రి కి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి తెలంగాణ గవర్నర్ కి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కి తమ గోడును ఉత్తరాల రూపంలో విన్నవించుకుంటున్నారు . కనుక బాధితులకు ప్రజాస్వామిక వాదులు ప్రజాతంత్ర వాదులు అభ్యుదవాదులు అందరూ అండగా ఉండి వెలుగుమట్లలో సంపూర్ణ వెలుగుకై కృషి చేయాలని అందుకు రేపు జరుగు మా ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు . భూదాన బాధితుల నిజనిర్ధారణ కమిటీ జిల్లా కన్వీనర్ కేతవరపు వి.కృష్ణారావు బాధితులు అందరూ ఐక్యంగా ఉండి మన ఇల్లులు మనం సాధించుకోవాలని మన మధ్యలో ఎవరూ చీలికను ఏర్పాటు చేసిన మనం ఐక్యమత్యం గా ఉండి అవసరమైతే రాష్ట్రపతి వద్దకు వెళ్లి మన బాధను మొరపెట్టుకుందామని అన్నారు . ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ వట్టే ఉదయ్ కిరణ్ , మట్ట నవ్య , సుమలత , రాము , కృష్ణ , అమీద్ , పాషా , రాము తదిరిల్లు పాల్గొన్నారు .



# ప్రపంచవ్యాప్తంగా కొత్త పోకడ.. అసలేమిటీ 'గ్రే మేరేజెస్'..?

- ఆస్తి సమస్యల కారణంగా కొందరు పెళ్లికి బదులుగా సహజీవనాన్ని ఎంచుకుంటున్న వైనం

ఒకప్పుడు పెళ్లిళ్లంటే పాతికేళ్లకే అనేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. అరవై ఏళ్లు దాటిన తర్వాత కూడా వివాహ బంధంలోకి అడుగుపెట్టే వారి సంఖ్య నెమ్మదిగా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ కొత్త పోకడను 'గ్రే మ్యారేజెస్' (+తీవఎ మీుతీతీఱువ్రవం) అని పిలుస్తున్నారు. జుట్టు నెరిసిన తర్వాత పెళ్లి చేసుకోవడాన్ని ఉద్దేశించి 'గ్రే మేరేజెస్' అంటున్నారు. ప్రజల్లో ఆరోగ్య స్పృహ కారణంగా పెరుగుతున్న ఆయుర్దాయం, మారుతున్న సామాజిక దృక్పథాలు ఈ మార్పుకు కారణమవుతున్నాయి.

# బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేష్ సూర్యవంశం





- నియామక పత్రాన్ని అందజేసిన జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్
- బిసి చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్

**తెలంగాణ హైదరాబాద్ : నగర నిజం జూన్ 7** హైదరాబాదులోని ఆదివారం నాడు బి సి, చైతన్య వేదిక సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బి.సి, విద్యార్థులకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీ.వో నెంబర్ 07ను రద్దు చేయాలి, పెండింగ్ లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలి.

విద్యాలయాల్లో ఎస్సీ ఎస్టీ, బి.సి, విద్యార్థులకు రక్షణ కల్పించే యుజిసి ఈక్వాలిటీ ఆక్ట్ అమలు చేయాలి.నీట్ పేపర్ లీక్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. బి.సి లకు ఉన్న క్రిమిలేయర్ ను ఎత్తివేయాలి. రాజ్యాంగ విరుద్ధమైన ఈబి.సి ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ రద్దు చేయాలి. ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలను మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యా నిధి నుండి తొలగించాలి.హైదరాబాద్: బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నగేష్ సూర్యవంశంను నియమించినట్లు బి.సి చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బి.సి చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. హైదరాబాదులో గల బి.సి సాధికారత సంస్థ భవన్లో బి.సి చైతన్య వేదిక జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ, బి.సి విద్యార్థులకు గొడ్డలిపెట్టుగా ఉన్న జీ.వో నెంబర్ 07ను రద్దు చేయాలి. జీ.వో నెంబర్ 07ను అదునుగా చేసుకొని, ఈ మధ్యకాలంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముందుగానే ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి., దీనికి అదనంగా పుస్తకాల ఫీజులని, అడ్మిషన్ ఫీజు అని వేలకు వేలు ముక్కు పిండి మరీ వసూలు చేసుకుంటున్నాయన్నారు. పూర్తిగా ఫీజులు కట్టలేని చాలామంది పేద విద్యార్థుల యొక్క సర్టిఫికెట్లు కళాశాలలోను ఉంచుకొని మానసిక వేదనకు, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.. దీనివల్ల ఈ మధ్య కొంతమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న ఉదంతాల్ని మనం చూడవచ్చు. ప్రభుత్వానికి కళాశాల యాజమాన్యాలకు ఏమైనా అంతర్గత సమస్యలుంటే వారు వారు చూసుకోవాలని అంతేకానీ .. అత్త మీది కోపం దుత్త మీద చూపించినట్టుగా.. విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ లను విడుదల చేయకపోవడం వల్ల ఈరోజు విద్యార్థులే ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ ప్రైవేటు యాజమాన్యాల ఫీజు ఫీజు దోపిడీలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక పటిష్టమైన "ఫీ రెగ్యులేటరీ కమిటీ" లేకపోవడం దురదృష్టకరమన్నారు.. ఈ ఫీజు దోపిడీ వల్ల నష్టపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు వారి బాధను చెప్పుకోవడానికి ఒక్క హెల్ప్ లైన్ నెంబర్ కానీ, జిల్లాస్థాయిలో ఒక ఆఫీసు కానీ లేకపోవడం చాలా బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి ప్రైవేటు యాజమాన్యాల ఫీజు దోపిడీకి కళ్లెం వేయాలని, ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తు, ఆందోళనలతో ముడిపడి ఉన్న అత్యంత సున్నితమైన అంశం. ఇప్పటివరకు ఒత్తిడికి లోనై నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి పరీక్షలో లోపాలు జరగడం, లక్షలాది మంది విద్యార్థుల శ్రమ వృథా కావడం విద్యాశాఖ వైఫల్యమే.. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు,బీ.సీ వర్గాల ఆర్థిక, విద్యా ప్రగతికి ఈ 'క్రిమిలేయర్' నిబంధన అడ్డుగా మారింది. దీనివల్ల ఉద్యోగులు, చిన్న వ్యాపారస్తుల పిల్లలు కేవలం కొద్దిపాటి ఆదాయ వ్యత్యాసం వల్ల రిజర్వేషన్లు కోల్పోతున్నారు. చదువుకున్న బి.సి కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యాసంస్థలు ఐఐటి, ఐఐఎం, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలకు దూరమవుతున్నారని ఆరోపించారు. బి.సిలు తీవ్రంగా నష్టపోతున్నారు కాబట్టి ఈ వర్గాల ఆర్థిక, విద్యా ప్రగతికి అడ్డుగా ఉన్న ఉన్న క్రిమిలేయర్ నిబంధనను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బి.సి విద్యార్థుల రక్షణ కల్పించే, కుల ఆధారిత వివక్షను నిర్మూలించడానికి, సమానత్వం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రవేశపెట్టిన 'ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ రెగ్యులేషన్స్, 2026'ను త్వరగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బి.సి చైతన్య వేదిక పోరాటాల ఉద్యమ ఫలితంగా అక్కడి ప్రభుత్వం బి.సి రక్షణ ముసాయిదా చట్టాన్ని రూపొందించిందని, మన తెలంగాణ రాష్ట్రంలో కూడా బి.సి వర్గాలు వివక్షతను ఎదుర్కొంటున్నారని.. కాబట్టి వారి కోసం బి.సి రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని ఈ ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈబి.సి ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ రద్దు చేయాలి, భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అనేవి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, ఓ.బి.సి వర్గాలకు చట్టసభల్లో, ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించినవి. కేవలం ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధం అని దుయ్యబట్టారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యా నిధి స్కాలర్షిప్ పథకానికి ఈ పథకం కేవలం తెలంగాణ రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల విద్యార్థులకు మాత్రమే వర్తించాలని, ఈబీసీ మరియు ఈడబ్ల్యూఎస్ వర్గాలను దీని నుండి మినహాయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే లెక్కలను బట్టి ఎవరు ఎంతో వారికి అంత రిజర్వేషన్ వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బి.సి చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగాగా నియమించిన జాతీయ కార్యవర్గానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన విద్యార్థి కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నగేష్ సూర్యవంశం, ఉపాధ్యక్షులుగా మేడిపల్లి గౌతమ్, ప్రధాన కార్యదర్శిగా బైకీని రమేష్, అధికార ప్రతినిధిగా నాతి శివరాజ్, కార్యదర్శిగా రెడ్డ మోని శ్రీశైలం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు టి. వినోద్ కుమార్, సలహాదారు మాదాసు రంగనాయకులు ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో బి.సి చైతన్య వేదిక జాతీయ సలహాదారు అక్కల బాబుగౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు సీమల శంకర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావు. మహిళ కార్యనిర్వాహక అధ్యక్షురాలు రేణుక దీదీ వాసం రాజేష్, పగిళ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నగర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది





- తిలక్

మేధన్స్ ఫుడ్ జోన్ ను టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్ రావు తో కలిసి ప్రారంభించిన ఎర్రంబాలగంగాధర్ తిలక్.**ఖమ్మం: (నగర నిజం బ్యూరో) జూన్ 7,** ఖమ్మం నగర ప్రజలకు సరికొత్త రుచులను, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి 'మేధన్స్ ఫుడ్ జోన్' సిద్ధమైంది. ఖమ్మం నగరం గుట్టల బజార్, కిన్నెరసాని థియేటర్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఈ హోటల్‌ను ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, త్రీ టౌన్ ఏరియా కో-ఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ మరియు టీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. హోటల్ నిర్వాహకులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.హోటల్‌ను ప్రారంభించిన అనంతరం యర్రం బాలగంగాధర్ తిలక్ మాట్లాడుతూ గౌరవ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం నగరం రోజురోజుకూ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. పెరుగుతున్న జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా ఇలాంటి ఆధునిక వసతులతో కూడిన హోటళ్లు రావడం శుభపరిణామన్నారు. వ్యాపార రంగాలు విస్తరించడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నగర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలకు కేవలం ఆహారాన్ని రుచిగా అందించడమే కాకుండా.. నాణ్యత, శుభ్రతపాటించినప్పుడే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. మేదాన్స్ ఫుడ్ జోన్ నిర్వాహకులు కూడా అదే బాటలో పయనించి కస్టమర్ల మనసులు గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు శ్రీనివాసరావు మరియు బాలగంగాధర్ తిలక్ మేధాన్స్ ఫుడ్ జోన్ యొక్క ప్రొప్రైటర్స్ కూచిపూడిశ్రీనివాసరావు,కూచిపూడి ఉదయ్ కుమార్ ను అభినందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో టీఎన్జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొనిదేనా శ్రీనివాస్, టీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు కోమగిరే దుర్గ ప్రసాద్, టీఎన్జీవో జాయింట్ సెక్రటరీ వల్లూరి శ్రీకాంత్,కూరపాటి రుక్మారావు, జిల్లా సెక్రెటరీ కాంగ్రెస్ పార్టీ డి.శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచిపూడి ముద్దు కృష్ణ, మెట్టు సల్మాన్, కూచిపూడి ప్రవీణ్ కుమార్, కూచిపూడి ఉపేందర్, దేవరకొండ ఫని, సురవెల్లి శ్రీనివాస్, కలకోట వెంకన్న, వెంపటి సాయి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలను గాలికి వదిలేసిన రేవంత్ సర్కార్

- రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలి
- సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి
- బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్



హైద్రాబాద్ జూన్ 7 ; తెలంగాణ రాష్ట్రం లో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బిజెపి రాష్ట్రనేత కొలను వెంకటరెడ్డి విమర్శించారు. ప్రజలను పట్టించుకోకపోవడం ,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వల్ల వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ జడ్పిటిసి సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై పట్టు కోల్పోయాడని, దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలు అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, కేంద్రాన్ని విమర్శించడం తప్ప పరిపాలనను గాలికి వదిలేసాడని విమర్శించారు. ఎంపీటీసీ సింగిల్ విండో ఎన్నికలు జరపక పోగా వాటికి నామినేటెడ్ పెదవులలో పార్టీ శ్రేణులు నియమించి మూలంగా రైతుల కు రావలసిన సౌకర్యాలు అనడం లేదని ,పాలన వ్యవస్థ లేకపోవడం మూలంగా సహకార వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు అంతేకాకుండా నేడు రాష్ట్రంలో యువతీ యువకులు రైతులు,విద్యార్థులు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతో ఉన్నారన్నది స్పష్టమవుతుంది అన్నారు .రైతు భరోసా కు తూట్లు పొడిచి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసారని ఆయన దుయ్యబట్టారు. ప్రజల సంక్షేమం గాలికి వదిలేసి కాంగ్రెస్ శ్రేణులకు రాజకీయ పునరవాసము కల్పించడం కోసం కుట్రలు చెస్తుందని ఆరోపించారు. వెంటనే రైతు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, కాంగ్రెస్ శ్రేణుల రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలని కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు....

## రాజ్యసభ సీట్లలో బీసీలకు అన్యాయం

- సామాజిక న్యాయాన్ని బొందపెట్టిన కాంగ్రెస్
- కాంగ్రెస్ పార్టీ మాటలకు ఆచరణకు ఎక్కడ పొంతనలేదు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



హైద్రాబాద్ జూన్ 7 : రాజ్యసభ ఖాళీల పరిధిలో సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా పొందబెట్టినని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రస్తుతం రాజ్యసభ స్థానాలను భర్తీ చేస్తున్న ఖాళీలలో బిజెపి నుండి 11 లో ఓసిలకు ఆరు, బీసీలకు 4, ఎస్ టి లకు 1 కేటాయించిందని, కాంగ్రెస్, ఏడులో ఓసిలకు 4, ఎస్సీలకు రెండు, మైనార్టీలకు ఒకటి కేటాయించిందని, తెలుగుదేశం మూడు లో, ఓసి లకు రెండు, బీసీలకు ఒకటి కేటాయించిందని, ఇక జనసేన ఒకటిలో కూడా ఓసీలకు ఉన్న ఒకటి కేటాయించిందని ఆయన తెలిపారు బిజెపి బీసీలకు నాలుగు కేటాయిస్తే, టిడిపి ఒకటి కేటాయిస్తే, కాంగ్రెస్ ఏడు సీట్లలో ఒక్కటి కూడా బీసీలకు కేటాయించకపోవడం చాలా దుర్మార్గం అన్నారు, కాంగ్రెస్ పార్టీ మాటలకు, ఆచరణకు ఎక్కడ పొంతనలేదని రాజ్యసభ సీట్ల కేటాయింపు ప్రత్యక్ష ఉదాహరణని ఆయన తెలిపారు. కాంగ్రెస్ లో ఉన్న పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రిలలోనూ అగ్రకులాలకు కేటాయించి, చివరికి రాజ్యసభ స్థానాలలో కూడా అన్నింటిని అగ్రకులాల కేటాయించి కాంగ్రెస్ పార్టీ బీసీలకు తీరని ద్రోహం చేసిందని ఆయన మండిపడ్డారు ఇక జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మంత్రివర్గంలో ఒక్కరికి కూడా బీసీలకు అవకాశం కల్పించలేదని, చివరికి రాజ్యసభ సీటు కేటాయింపులు ఒక్క సీటు అవకాశం వస్తే ఆ ఒక్క సీటును కూడా అగ్రకులాలకే కేటాయించి జనసేన అగ్రకుల సేనగా మార్చాడని ఆయన ఆరోపించారు

## వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులుగా మహేందర్, రాజు ఎన్నిక.

- సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**మొయినాబాద్, జూన్ 07 (నగర నిజం):** చేవెళ్ల మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం యూపీఏ -1 లో వామపక్ష పార్టీల కృషితో వచ్చిందని గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో పేదరిక నిర్మూలన కోసం ఆరోజు కమ్యూనిస్టు నాయకులు పార్లమెంట్లో పోరాటం చేసి చట్టం ఏర్పాటుకు కృషి చేశారని అన్నారు కానీ నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరు గారిచే విధంగా వి బి జి రాంజీ అని పేరు మార్చి నిధుల కోత విధిస్తున్నారని ఆన్లైన్ విధానం ఫోటో తీసుకువచ్చి సర్వర్ పని చేయక కార్మికులు ఉపాధి హామీ పనులకు దూరం కావాలని దురుద్దేశంతో దుర్మార్గమైన ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు అనంతరం నూతన వ్యవసాయ కార్మిక సంఘం కమిటీని ఎన్నుకోవడం జరిగింది వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల మండల అధ్యక్షులుగా చనువల్లి గ్రామానికి చెందిన మహేందర్, కౌకుంట్ల గ్రామానికి చెందిన రాజు ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది మహిళ కన్వీనర్లు గా ఉషారాణి భారతి లను 12 మందిని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ఉపాధి హామీ కూలీలపై ఉన్నదని పెండింగ్ బిల్లులపై పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ చేవెళ్ల మండల కన్వీనర్ జంగయ్య వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు నర్సింలు శ్రీనివాస్ ఏ అంజనేయులు వెంకటేష్ రామ చంద్రయ్య కిష్టయ్య స్రవంతి తదితరులు పాల్గొన్నారు

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ తోట మహేష్ కుమార్ ఆధ్వర్యంలో



**కొమరవెల్లి మండలం, జూన్,7,(నగర నిజం):** కిష్టంపేట గ్రామంలో కనువిప్పు కళా ప్రదర్శనలో ఎస్ఐ తోట మహేష్ కుమార్ పిలుపు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బిజ్జురి రవికుమార్ తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై డ్రగ్స్ నివారణపై పోలీస్ కనువిప్పు సారధి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొమురవెల్లి ఎస్ఐ తోట మహేష్ కుమార్ హాజరై మాట్లాడుతూ సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దని కోరారు. చిన్న చిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు అని మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు. యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంజాల జ్యోతి మల్లేశం,పోలీస్ కనువిప్పు బృందం బాలు,రాజు, తిరుమల, మరియు తెలంగాణ సాంస్కృతిక సారధి టీమ్ లీడర్ శ్యామ్, సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం, గెంటే హరిప్రసాద్,సనువాల కనుకయ్య,పన్నీరు శ్రీనివాస్,ఎల్ల సిద్దులు,డప్పు తండ బిక్షపతి, తదితర కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## అమెరికాలో రూ.1 కోటి జీతం వచ్చినా... చివరకు మిగిలేదెంత..?

- జీతంలో 40 శాతం వరకు పన్నులకే పోతుందని వెల్లడి

అమెరికాలో ఉద్యోగం, కోటి రూపాయల వార్షిక ప్యాకేజీ అనగానే చాలామందికి అద్భుతమైన జీవితం కళ్లముందు కదలాడుతుంది. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటాయని న్యూయార్క్‌లో నివసిస్తున్న యష్ శర్మ అనే భారతీయ యువకుడు లెక్కలతో సహా వివరిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో అతను పోస్ట్ చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. యష్ శర్మ విశ్లేషణ ప్రకారం, న్యూయార్క్‌లో రూ.1 కోటి వార్షిక ప్యాకేజీతో జీవించడం కంటే, భారతదేశంలోని ఒక మంచి నగరంలో రూ.25-30 లక్షల జీతంతో మరింత సౌకర్యవంతమైన, విలాసవంతమైన జీవితం గడపవచ్చు. దీనికి గల కారణాలను అతను స్పష్టంగా వివరించాడు. న్యూయార్క్‌లో ఫెడరల్, స్టేట్, సిటీ పన్నులతో పాటు ఇతరత్రా కోతలన్నీ కలిపి సంపాదనలో దాదాపు 35 శాతం నుంచి 40 శాతం వరకు పన్నుల రూపంలోనే ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని తెలిపాడు. అంటే, కోటి రూపాయల జీతంలో సుమారు రూ.35-40 లక్షలు పన్నులకే పోతాయి. ఇక ఇంటి అద్దెల విషయానికొస్తే, నగరంలోని ఒక మంచి ప్రాంతంలో నివసించాలంటే నెలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుందని యష్ పేర్కొన్నాడు. ఈ పన్నులు, అద్దెలు, రోజువారీ ఖర్చులన్నీ పోగా మిగిలేది చాలా తక్కువని అతను అంటున్నాడు. ఈ వీడియోపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. "చాలామంది డాలర్లను రూపాయల్లోకి మార్చి చూస్తారు కానీ, అక్కడి ఖర్చులను పట్టించుకోరు" అని కొందరు యష్ వాదనను సమర్థిస్తున్నారు. అయితే, "న్యూయార్క్ అమెరికా మొత్తానికి ప్రాతినిధ్యం వహించదు, అక్కడ జీవన నాణ్యత మెరుగ్గా ఉంటుంది" అని మరికొందరు అభిప్రాయపడుతున్నారు

# ఖమ్మంలో ఘనంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు





- జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ
- ప్రధాన కార్యదర్శిఅర్వపల్లి నగేష్

**ఖమ్మం:(నగర నిజం బ్యూరో) జూన్ 7:** తెలంగాణ జర్నలిస్ట ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ నాయకుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తొలి రాష్ట్ర అధ్యక్షుడు లిలిమామిడి సోమయ్య 61వ జన్మదిన వేడుకలలిస్థానిక ఖమ్మం నగరంలో గల అన్నం ఫౌండేషన్ వారి అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి అనంతరం మరియు పండ్లు కూడా పంచుతూ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఖమ్మం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది అనంతరం శ్రీ కుసుమా రియల్ ఎస్టేట్ వారి గార్డెన్ లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి సోమయ్య పేరు మీద శివుడికి ఇష్టమైన కదంబ చెట్టును నాటడం జరిగింది అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ, సోమయ్య ప్రస్థానం ఉమ్మడి నల్గొండ జిల్లా గా ఉన్నప్పుడు మొదలై ఇప్పుడు ప్రస్తుతం సూర్యాపేట జిల్లా గా మార్పు చెందింది. ఆనాడు నల్లగొండ జిల్లా లోని సూర్యాపేట కు చెందిన, సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సోమయ్య, హైదరాబాద్‌లో పీ.జీ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేసి, జర్నలిజాన్ని సామాజిక సేవా సాధనంగామల్చుకున్నారు. ఉద్యమ ప్రస్థానం2008లో 1300 మంది సభ్యులతో కూడినగ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీని స్థాపించారు. 2009లో హైదరాబాద్జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడిగా; ఎన్నికయ్యారు. సంస్థల నిర్మాణంప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పాత్రికేయులను ఏకం చేస్తూ 2010లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్‌ను, ఆ తర్వాత 2014 జూన్ 12న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ను స్థాపించి 33 జిల్లాలకు విస్తరించారు. ముఖ్య పోరాటాలు:-జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, బీమా, పింఛన్లు, పాత్రికేయ స్వేచ్ఛ మరియు రక్షణ కోసం మూడు దశాబ్దాలుగా నిరంతర పోరాటాలుసాగించారు. అందుకున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాలు: గౌరవ డాక్టరేట్ (2020) గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుండి డాక్టర్ ఆఫ్ జర్నలిజం' పట్టా. రాష్ట్రస్థాయి అవార్డులు: పాత్రికేయ శిరోమణి పురస్కారం' (2019) 'పాత్రికేయ సేవా రత్న పురస్కారం', మరియు నల్లగొండ జిల్లాలో ఉగాది శ్రేష్ఠ పాత్రికేయ పురస్కారం (2026)' జాతీయ పురస్కారం:సామాజిక బాధ్యత గల జర్నలిజానికి గాను జాతీయ స్థాయి లి'స్పైస్ అవార్డు 60 ఏళ్ల జీవన ప్రస్థానాన్ని, 30 ఏళ్ల ఉద్యమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 61వ వసంతంలోకి అడుగుపెడుతున్న మామిడి సోమయ్యకు ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజెఎఫ్ (ఎ-2843), అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్ల రాకేష్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ మరియు మామిడాల కిరణ్, టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఎ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పులిపాటి పాపారావు, మరియు ఫెడరేషన్ సభ్యులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## జీవితానికి వెలుగునిచ్చే ఉత్తమ బంధం స్నేహబంధమే: చెరుకు మహేశ్వర శర్మ



**రాయికల్ జూన్ 07 (నగర నిజం)** జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు చెరుకు మహేశ్వర శర్మ స్నేహం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ ప్రత్యేక వ్యాసాన్ని అందించారు. మానవ సంబంధాలన్నింటిలో అత్యంత పవిత్రమైనది, స్వచ్ఛమైనది స్నేహమని ఆయన పేర్కొన్నారు. కష్టం వచ్చినప్పుడు ధైర్యం చెప్పేవాడు, సుఖం వచ్చినప్పుడు మనకంటే ఎక్కువ ఆనందించేవాడు నిజమైన స్నేహితుడని తెలిపారు. రక్త సంబంధం లేకపోయినా స్వార్థం లేకుండా ఒకరికొకరు అండగా నిలిచేది స్నేహబంధమని వివరించారు. పురాణాల్లోని శ్రీకృష్ణుడు-కుచేలుడు, కర్ణుడు-దుర్యోధనుడి స్నేహాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, నిజమైన స్నేహానికి కులం, మతం, హోదా, సంపద వంటి భేదాలు ఉండవని అన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియాలో వందల మంది స్నేహితులు ఉన్నప్పటికీ, మన బాధను అర్థం చేసుకుని మనతో నిలిచే వ్యక్తే నిజమైన ఉత్తమ స్నేహితుడని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి పెరుగుతున్న నేటి కాలంలో మంచి స్నేహితుడితో మనసు విప్పి మాట్లాడటం ఎంతో అవసరమని సూచించారు. జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ స్నేహితులతో సమయం గడపాలని, వారికి కృతజ్ఞతలు తెలియజేయాలని చెరుకు మహేశ్వర శర్మ పిలుపునిచ్చారు. "ఆస్తులు సంపాదించడం కంటే మంచి స్నేహితుడిని సంపాదించుకోవడం జీవితంలో అతిపెద్ద విజయం" అని ఆయన అన్నారు.

## రెండు దశాబ్దాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు..
# ఆత్మీయ సమ్మేళనంలో జ్ఞాపకాల సందడి





**రాయికల్ జూన్ 07 (నగర నిజం)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకున్న వారు పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు వివిధ సబ్జెక్టులను బోధించిన ఉపాధ్యాయులు నాగభూషణం, మీనయ్య, జయ, శిరీష, జ్యోతి, పొన్నం రమేష్‌ల సేవలను స్మరించుకున్నారు. విద్యార్థి దశలో అందించిన విద్య, క్రమశిక్షణ, మార్గదర్శకత్వమే తమ జీవిత విజయాలకు పునాది అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని వారు సూచించారు. ఇరవై సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకునే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ కలయిక చిరస్మరణీయంగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పొన్నం రమేష్ మాట్లాడుతూ, తాము బోధించిన విద్యార్థులు సమాజంలో గౌరవప్రదమైన స్థాయికి ఎదగడం ప్రతి ఉపాధ్యాయుడికి గర్వకారణమని అన్నారు. పూర్వ విద్యార్థులు తమ పాఠశాలతో అనుబంధాన్ని కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం రజిత, రాణవేణి, గంగమణి, ఇంద్రాల రజని, బైరి శ్రీకళ, మచ్చ ప్రత్యక్ష, రాధ, రాజ్యలక్ష్మి, ఉడత మానస తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# కష్టపడితే ఎప్పటికైనా ఫలితంఉంటుంది

- భారత్ స్కౌట్స్ & గైడ్స్ హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్



**హైద్రాబాద్ జూన్ 7 :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ పరేడ్‌లో మన స్కౌట్స్ & గైడ్స్ బృందం నిరాయుధ విభాగంలో మొదటి స్థానాన్ని గెలుచుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని తనెంతో గర్వపడుతున్నానని ది భారత్ స్కౌట్స్ & గైడ్స్ హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వి. లక్ష్మణ్ నాయక్ అన్నారు. ఈ విజయం మీలో ప్రతి ఒక్కరికీ చెందుతుంది. మీ క్రమశిక్షణ, అంతులేని సాధన మరియు అంకితభావానికి ధన్యవాదాలంటూ విద్యార్థులతో తన ఆత్మీయతను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ప్రతి కమాండ్‌ను సంపూర్ణంగా అమలు చేసి, మనందరికీ గర్వకారణంగా నిలిచారు. మన గైడ్స్ మరియు స్కౌట్స్‌కు: శిక్షణ సమయంలో మీ దోషరహితమైన భంగిమ, లయ మరియు అంకితభావానికి. మన నాయకులు & శిక్షకులకు: మీ నిరంతర మార్గదర్శకత్వం, ఓపిక మరియు పరిపూర్ణత వైపునడిపించినందుకుసపోర్ట్ టీమ్‌కు: తెరవెనుక ప్రతిదానిని ఎంతో సజావుగా నిర్వహించినందుకు నేనునాహృదయపూర్వకకృతజ్ఞతలుతెలుపుతున్నాను. కష్టపడితే ఎప్పటికైనా ఫలితం ఉంటుందనడానికి ఈ ట్రోఫీ ఒక నిదర్శనం. ఈ గౌరవాన్ని మన ఇంటికి తీసుకువచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. మరిన్ని విజయాల వైపు లెఫ్ట్, రైట్, ఫార్వర్డ్ మార్చ్!అంటూ విద్యార్థులతో పాలు పంచుకున్నారు.



# జంతర్ మంతర్ నిరసన ట్రైలర్ మాత్రమే..

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: అభిజీత్ దీప్కే అల్టిమేటం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు 7 రోజుల గడువు
- మంత్రిని తొలగించకపోతే నిరసనలు కొనసాగిస్తామని అభిజీత్ దీప్కే హెచ్చరిక
- జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ఒక ట్రైలర్ మాత్రమేనని వ్యాఖ్య
- శాంతియుత ఉద్యమాన్ని ప్రభుత్వం ఏమీ చేయలేదని స్పష్టం



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఏడు రోజుల్లోగా మంత్రి తన పదవి నుంచి తప్పుకోవాలని, లేదంటే దేశవ్యాప్తంగా నిరసనలను ఉద్ధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిన్న జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో తాము చేపట్టిన శాంతియుత నిరసన ఒక చరిత్ర అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. "'బొద్దింకలు' ఏకమైతే ఏం చేయగలవో ప్రభుత్వానికి మేం చూపించిన ట్రైలర్ ఇది. నిన్నటి నిరసనలో పాల్గొన్న వారిలో చాలామందికి అదే తొలిసారి. అయినా, విద్యావ్యవస్థపై తమకున్న తీవ్రమైన కోపాన్ని, నిరాశను వ్యక్తం చేయడానికి వారు ధైర్యంగా ముందుకు వచ్చారు" అని ఆయన తెలిపారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా నిరసనలో పాల్గొన్న యువత, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. "శాంతియుత నిరసనే మన గొప్ప బలం. ఐక్యంగా ఉన్న శాంతియుత ఉద్యమాన్ని ప్రభుత్వం ఏమీ చేయలేదు. మనం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ఒక తరానికి అన్యాయం చేశారని ఆరోపించిన ఆయన, ఈ విషయం ఇక్కడితో ముగిసిపోదని స్పష్టం చేశారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈరోజు ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో మాట్లాడతానని ఆయన తన అనుచరులకు సూచించారు.

# అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బొగ్గుల సురేష్ విజయం



గజ్వేల్ ప్రజ్ఞాపూర్, జూన్ ,7,(నగర నిజం): గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నూతన పాలకవర్గ ఎన్నికలు ఆదివారం అత్యంత హోరాహోరీగా సాగాయి. ఈ ఎన్నికల్లో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌పై బొగ్గుల సురేష్ ఘన విజయం సాధించి, నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ వివరాలు: అధ్యక్షుడు: బొగ్గుల సురేష్ఉపాధ్యక్షుడు: జగ్గయ్యగారి శేఖర్ప్రధాన కార్యదర్శి: అయిత సత్యనారాయణసహాయ కార్యదర్శి: తూమ్ గోపికోశాధికారి: నారాయణరెడ్డిఅయ్యప్ప స్వామి ఆలయ నూతన కమిటీగా ఎన్నికైన బొగ్గుల సురేష్ బృందాన్ని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ ఘనంగా శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ అయ్యప్ప ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఆలయ శాశ్వత సభ్యులను, భక్తులను కలుపుకొని పోతూ ఆలయ అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలని, అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని వారు కోరారు. అనంతరం నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల సురేష్ మాట్లాడుతూ మాపై నమ్మకంతో అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు అని, అయ్యప్ప స్వామి ఆలయ సేవలో, అభివృద్ధిలో మేము ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. నూతన కార్యవర్గం విజయం సాధించినందుకు ఆలయ శాశ్వత సభ్యులు, భక్తులు, స్థానిక నేతలు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా జాలిగం రాకేష్

**ఉద్యమకారుల సమ్మేళనానికి ఘన ఆహ్వానం అందుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు**









కుత్బుల్లాపూర్, 7 జూన్ (నగర నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన చారిత్రాత్మక ఉద్యమంలో ప్రజల్లో చైతన్యం నింపుతూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేందుకు కృషి చేసిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జాలిగం రాకేష్‌కు తెలంగాణ ఉద్యమకారుల మహాసమ్మేళనానికి ప్రత్యేక ఆహ్వానం అందడం రాజకీయ, సామాజిక వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఉద్యమకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి ఆయనను ఆహ్వానిస్తూ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పిడ మూర్తి రవి మరియు ఇతర నిర్వహణ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.సమ్మేళనానికి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేసిన అనంతరం ఉద్యమకారులు, నిర్వాహక కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు జాలిగం రాకేష్‌తో కలిసి ఫొటోలు దిగారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఉన్న ఆ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. ఉద్యమ నాయకుల మధ్య జాలిగం రాకేష్‌కు లభిస్తున్న గౌరవం, ఆదరణ స్పష్టంగా కనిపిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఉద్యమ కాలాన్ని గుర్తు చేసేలా ఉన్న ఫొటోల్లో తెలంగాణ జెండాలు, ఉద్యమ నినాదాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.తెలంగాణ కోసం అంకిత భావంతో పనిచేసిన ఉద్యమకారుడుతెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న రోజుల నుంచే జాలిగం రాకేష్ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించేందుకు అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.

# మాశమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందిన బిఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు



గద్వాల జిల్లా: నగర నిజం జూన్ 7 గద్వాల జిల్లా ఆదివారం నాడు కేంద్రంలోని దౌదర్ పల్లి కాలనీలో నిర్వహించిన మాశమ్మ అమ్మవారి ఆలయ కార్యక్రమంలో గద్వాల నియోజకవర్గ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు పాల్గొన్నారు. కౌన్సిలర్ టీఎన్ఆర్ జగదీష్ ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం బాసు హనుమంతు నాయుడిని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, చంటన్న, గువ్వల గోపాల్, దుబన్న, మోహన్ యాదవ్, చిత్తరి కిరణ్, రామకృష్ణ, కమ్మరి రాము, నరసింహులు, రాము, చాకలి శ్రీనివాసులు, వీరేష్, రాజు, మహేష్, కృష్ణ, రవి, మోహన్, నాగేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వనపర్తి జిల్లా వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిని తక్షణమే చేపట్టాలి

**జిల్లా కలెక్టర్‌కు - ఎమ్మెల్యే కి విజ్ఞప్తి**
**బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**





వనపర్తి జిల్లా: నగర నిజం జూన్ 7 వనపర్తి జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను తక్షణమే బాగు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వనపర్తి-పెబ్బేరు ఆదివారం నాడు రోడ్డును బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులతో కలిసి ఆయన రోడ్లను పరిశీలించారు.అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు 600 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రహదారులు ఉన్నాయని, అందులో 200 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతల మయంగా ఉందన్నారు.వనపర్తి నుంచి పెబ్బేరు వరకు 20 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డులో తొమ్మిది కిలోమీటర్లకు పైగా అధ్వానంగా మారి ప్రయాణికులకు నరకయాతన కలిగిస్తుందని తెలిపారు.ప్రతినిత్యం అభివృద్ధి పేరుతో జపం చేస్తున్న జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వనపర్తి-పెబ్బేరు రోడ్డు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అనారోగ్య సమస్యలతో పెబ్బేరు నుంచి వనపర్తికి వచ్చే ప్రయాణికులు గతుకుల, గుంతల మయంగా మారిన రోడ్డు వల్ల మార్గమధ్యలోనే అనంత లోకాలకు వెళ్లే విధంగా రహదారి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ఆర్ అండ్ బి అధికారులను సంప్రదించగా రోడ్డు మరమ్మత్తులకు శాంక్షన్ కాలేదని బదులివ్వడం ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు.నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లుగా ఇటీవలే ప్రజా ప్రతినిధులు వెల్లడించినట్లు ఆయన గుర్తు చేశారు. వనపర్తి-పెబ్బేరు బీటి రోడ్డు అభివృద్ధిలో భాగం కాదా? అని, ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పెబ్బేరు వనపర్తి రోడ్డుతో పాటు జిల్లాలో ధ్వంసమైన ఆర్ అండ్ బి రోడ్లను బాగు చేయాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ జెఏసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిళ్ళ రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఫిట్ ఇండియా సండేస్ అన్ సైక్లింగ్

**ర్యాలీని ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల**




హైద్రాబాద్ జూన్ 7 నగర నిజం:ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా సండేస్ అన్ సైక్లింగ్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన సైకిల్ ర్యాలీకి నగరంలోని సైక్లిస్టుల నుండి అద్భుత స్పందన లభించింది.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు శ్రీ శివ ప్రతాప్ శుక్ల జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు వాకిటి శ్రీహరి రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోనీ బాలదేవి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో విస్తృతస్థాయిలో నిర్వహిస్తున్నరని, రాష్ట్రంలో అద్భుతమైన క్రీడా ప్రతిభ ఉందని గవర్నర్ శ్రీ శివప్రసాద్ అన్నారు. విస్తృత స్థాయిలో వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా శాఖను ఆయన అభినందించారు. ఇందులో పాల్గొన్న ప్రతి సైకిలిస్టుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్




హైదరాబాద్, 7 జూన్ (నగర నిజం) :ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపకుండా ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని విద్యావేత్తలు, తల్లిదండ్రుల సంఘాలు కోరుతున్నాయి.జి.ఓ.ఎం.ఎస్. నెం.1, తేదీ 1-1-1994 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ఐదు శాతానికి తగ్గకుండా లాభాలను మాత్రమే ఆశించాలి. వసూలు చేసే ఫీజుల్లో 50 శాతం మొత్తాన్ని ఉపాధ్యాయుల వేతనాల కోసం కేటాయించాల్సి ఉంటుంది. ప్రతి సంవత్సరం వార్షిక నివేదికలు, ఆడిట్ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాల్సిన బాధ్యత కూడా యాజమాన్యాలపై ఉంది.జి.ఓ.ఎం.ఎస్. నెం.42, తేదీ 30-7-2010 ప్రకారం పాఠశాలలు ఫీజులు పెంచాలంటే జిల్లా ఫీజు నియంత్రణ కమిటీ (డీఎఫ్ఆర్‌సీ) అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.జి.ఓ.ఎం.ఎస్. నెం.246 ప్రకారం పాఠశాలల నిర్వహణలో సమాజానికి భాగస్వామ్యం కల్పించాలి. సీబీఎస్ఈ నిబంధనల మేరకు ప్రతి పాఠశాలలో పేరెంట్ టీచర్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలి. ఇందులో ఇద్దరు తల్లిదండ్రులకు ప్రాతినిధ్యం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఫీజుల పెంపుపై నిర్ణయం తీసుకోవాలి.జి.ఓ.ఎం.ఎస్. నెం.91, తేదీ 6-8-2009 ప్రకారం ఒకసారి మాత్రమే వసూలు చేసే అప్లికేషన్ ఫీజు రూ.100, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500, తిరిగి చెల్లించాల్సిన కాషన్ డిపాజిట్ రూ.5,000కు మించకూడదు. అదే జీవోలోని సెక్షన్ 1(సి) ప్రకారం పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలను యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని బలవంతం చేయరాదు. పాఠశాల ప్రాంగణంలో వీటి విక్రయాల కోసం కౌంటర్లు ఏర్పాటు చేయకూడదు. తల్లిదండ్రులు తమకు నచ్చిన దుకాణాల్లో కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ కలిగి ఉంటారు.అలాగే సి అండ్ డీఎస్ఈ ప్రొసీడింగ్స్ ఆర్‌సీ నెం.780, తేదీ 16-5-2013లోని సెక్షన్ 8(1) ప్రకారం పాఠశాలల బోర్డులపై ఇంటర్నేషనల్, ఐఐటీ, ఒలింపియాడ్, కాన్సెప్ట్, ఈ-టెక్నో, ఈ-శాస్త్ర వంటి పదాలను ఉపయోగించరాదు. పాఠశాల పేరు తర్వాత కేవలం "స్కూల్" అని మాత్రమే పేర్కొనాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం జారీ చేసిన ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు విద్యా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ

## ఎస్ఎస్కె సేవా సంఘ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం




కుత్బుల్లాపూర్, 7 జూన్ (నగర నిజం ప్రతినిధి): షాపూర్ నగర్‌లోని ఎస్ఎస్కె సేవా సంఘ్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక చైర్మన్ దగుడు ప్రశాంత్ అధ్యక్షతన క్షత్రియ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల రాజన్న, మేడ్చల్--మల్కాజిగిరి బీజేపీ ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, అలాగే ఎస్ఎస్కె సమాజ్ హైదరాబాద్ మరియు మార్క్ట్ సొసైటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని ఉచితంగా అందించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆధారమని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువులో ముందుకు సాగాలని సూచించారు. ఎస్ఎస్కె సేవా సంఘ్ వ్యవస్థాపక చైర్మన్ దగుడు ప్రశాంత్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాల విద్యార్థులకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నోటు పుస్తకాల పంపిణీకి పలువురు దాతలు సహకరించడం సంతోషకరమని పేర్కొంటూ, కోనేరి సాయి కిరణ్, పవార్ రాకేష్, పవార్ సతీష్, గోరక్ సాయి, ఎం. అశోక్, జె. ప్రసాద్, జి. నర్సింగ్, ఎస్. వెంకటేష్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 152 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షాపూర్ నగర్ ఎస్ఎస్కె పాట్కర్ (ఖత్రి) సమాజ్ కమిటీ

# మల్కాజిగిరి అభివృద్ధికి మరో మైలురాయి ఎంఎంసీ నూతన భవనానికి నేడు శంకుస్థాపన

**రూ.100 కోట్లతో ఆధునిక పరిపాలన కేంద్రం నిర్మాణం -- ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయని దాము మహేందర్ యాదవ్ వెల్లడి**





ఎల్బీనగర్, జూన్ 7: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని ప్రజలకు పరిపాలనా సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న నూతన ఎంఎంసీ భవన నిర్మాణం ప్రాంత అభివృద్ధిలో కీలక ఘట్టంగా నిలవనుందని చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దాము మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఉప్పల్ భగాయత్‌లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ నూతన భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమయ్యే ఈ పరిపాలన కేంద్రం ద్వారా ప్రజలకు ఒకే చోట మెరుగైన పౌర సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. మల్కాజిగిరి ప్రాంత అవసరాలు, సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందని, అందువల్లే ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఇప్పుడు ప్రత్యేక పరిపాలన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ప్రజలకు మేలు చేసే నిర్ణయమని అభిప్రాయపడ్డారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, నూతన ఎంఎంసీ భవనం కూడా ఆ అభివృద్ధి ప్రణాళికలో భాగమేనని తెలిపారు. ఈ కార్యాలయం ఏర్పాటుతో ఎల్బీనగర్, ఉప్పల్, నాగోల్, మహేశ్వరం ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందనున్నాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజాభిమానంతో ముందంజలో ఉంటుందని, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధు యాష్కీ గౌడ్ నాయకత్వంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెజారిటీ డివిజన్లలో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేస్తుందని దాము మహేందర్ యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.



# వంటగ్యాస్ ధరల పెంపుపై బీఆర్ఎస్ మహిళల నిరసన





ఎల్బీనగర్, జూన్ 7 : కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను వరుసగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకులు మండిపడ్డారు. తాజాగా 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.29 పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎల్బీనగర్ చౌరస్తా వద్ద వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ, గత మూడు నాలుగు నెలల కాలంలో గ్యాస్ ధరలు పలుమార్లు పెరిగి మొత్తం రూ.89 వరకు భారంగా మారాయని ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, విద్యా, వైద్య ఖర్చులు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వంటగ్యాస్ ధరల పెంపు కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీస్తోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళలు వంటగ్యాస్ ఖర్చులను భరించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవడంతో పాటు సబ్సిడీ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజలపై భారం మోపే నిర్ణయాలను పునఃపరిశీలించి ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మకు బియ్యం బోనాలు సమర్పించిన రామాయపల్లి గౌడ సంఘం



మెదక్ బ్యూరో : నగర నిజం : మనోహరాబాద్, జూన్ 7:మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల మే నెలలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాల అనంతరంగా ఆదివారం కొమురవెల్లి మల్లన్న స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో బియ్యం బోనాలు సమర్పించినట్లు గౌడ సంఘం సభ్యులు మీడియాకు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, గౌడ సంఘం నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతుల కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక మొక్కు తీర్చుకున్న గౌడ సంఘంకొమురవెల్లి మల్లన్న సన్నిధిలో బియ్యం బోనాల సమర్పణభక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులుగ్రామ సుఖశాంతుల కోసం స్వామివారికి ప్రార్థనలు.





# కురుమ యువ చైతన్య సమితి ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాల్ద శ్రీకాంత్ కురుమ నియామకం

## కురుమ జాతి అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానన్న నూతన ఇన్‌చార్జి



ఎల్బీనగర్, జూన్ 7 (నగర నిజం): కురుమ యువ చైతన్య సమితి ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాల్ద శ్రీకాంత్ కురుమ నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బాల్ద శ్రీకాంత్ కురుమ మాట్లాడుతూ, కురుమ సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ యువతను సంఘటితం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ, కురుమ జాతి సంక్షేమం మరియు అభివృద్ధి కోసం నిరంతరం సేవలందిస్తానని పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ కురుమతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి నాయకులు, కార్యకర్తలు, కురుమ సంఘ ప్రతినిధులు పాల్గొని బాల్ద శ్రీకాంత్ కురుమకు శుభాకాంక్షలు తెలిపారు.

నగరనిజం


# షటిల్ కోర్టు నిర్వహణపై ఎంఎంసీ క్రీడా విభాగం నిర్లక్ష్యం

**నిర్వహణ లేకుండా ఫీజులు పెంచడం అన్యాయం - మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ఆగ్రహం**




ఎల్బీనగర్, జూన్ 7 (నగర నిజం): బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ ఇండోర్ షటిల్ కోర్టు నిర్వహణ విషయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) క్రీడా విభాగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి విమర్శించారు. షటిల్ కోర్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని క్రీడాకారులు కోరడంతో ఆయన క్రీడా సభ్యులతో కలిసి కోర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఇండోర్ స్టేడియం పైకప్పు వర్షాల సమయంలో లీకేజీ అవుతోందని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. స్టేడియం పరిసరాల్లో చెత్త పేరుకుపోయి పరిశుభ్రత పూర్తిగా లోపించిందని, కనీస నిర్వహణ కూడా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. షటిల్ కోర్టును వినియోగిస్తున్న క్రీడాకారుల నుంచి ఇప్పటివరకు నెలకు రూ.500 ఫీజు వసూలు చేస్తూ వచ్చారని, అయితే నిర్వహణ మెరుగుపరచకుండా ఒక్కసారిగా ఆ రుసుమును రూ.1500కు పెంచడం సమంజసం కాదని అన్నారు. క్రీడాకారులు చెల్లిస్తున్న ఫీజులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఎంఎంసీకి ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ, నిర్వహణ పనులను క్రీడాకారులే సొంత ఖర్చులతో నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో షటిల్ కోర్టు మరమ్మతుల కోసం రూ.25 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం ఉందని, వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. షటిల్ కోర్టు సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే క్రీడాకారులు, స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని మొద్దు లచ్చి రెడ్డి హెచ్చరించారు.

# వీరన్నగుట్ట క్షేత్రాన్ని దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం

## ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**క్షేత్ర అభివృద్ధి, కాలనీల మౌలిక సదుపాయాలపై సమీక్ష సమావేశం - ప్రజల సూచనలు స్వీకరించిన ఎమ్మెల్యే**




ఎల్బీనగర్, జూన్ 7: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ వీరన్నగుట్ట భద్రకాళి రామలింగేశ్వరస్వామి క్షేత్ర అభివృద్ధి పనులు, పరిసర కాలనీల సమస్యల పరిష్కారంపై భారాస యువ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని పది నుంచి పన్నెండు కాలనీల ప్రతినిధులు, కాలనీవాసులు సమావేశంలో పాల్గొని క్షేత్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. ముఖ్యంగా ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్, తాగునీరు, విద్యుత్ దీపాలు, పరిశుభ్రత, రహదారులు వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని కోరారు. అలాగే పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల అభివృద్ధిలో కాలనీ సంఘాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనులు పూర్తయిన అనంతరం మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ఇప్పటికే ట్రంక్ లైన్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనుల కారణంగా కొంత అసౌకర్యం ఉన్నప్పటికీ ప్రజలు సహకరించాలని కోరారు. త్వరలోనే అన్ని కాలనీలకు డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలు కల్పించి అనంతరం నాణ్యమైన రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. వీరన్నగుట్ట క్షేత్రం ఆధ్యాత్మికంగా విశిష్టమైన పుణ్యక్షేత్రమని, భక్తులకు అన్ని విధాలా మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దేవాలయ అభివృద్ధి కోసం గతంలో దేవాదాయ శాఖ ద్వారా రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో తొలి విడతగా రూ.5 కోట్లతో కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు నెమ్మదిగా సాగుతున్నప్పటికీ క్షేత్ర అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. వీరన్నగుట్టను రాష్ట్రంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, చెన్నగోని శ్రీధర్ గౌడ్, నక్క రవీందర్ గౌడ్, మల్లీశ్వరి రెడ్డి, ధనలక్ష్మి, కళ్లెం రవీందర్ రెడ్డి, రమేష్ గౌడ్, శంకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు మరియు కాలనీవాసులు సమావేశంలో పాల్గొన్నారు.



# శివ ప్రకాష్ జన్మదిన వేడుకల సందర్భంగా

# మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరం




చైతన్యపురి, 7, జూన్ (నగర నిజం) : చైతన్యపురి బాబు కాంప్లెక్స్ సమీపంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు శివ ప్రకాష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక సేవకు ప్రాధాన్యత ఇచ్చారు. ఉదయం నుంచే అభిమానులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా రక్షిత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వివిధ వ్యాధులపై వైద్యులు సూచనలు అందించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని నిర్వాహకులు పేర్కొన్నారు.జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానులు శివ ప్రకాష్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి భోజన వసతి కల్పించారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, శివ ప్రకాష్ రాజకీయ నాయకుడిగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.శివ ప్రకాష్ మాట్లాడుతూ, తనపై అభిమానులు చూపుతున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని, రక్తదానం వంటి కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి, చైతన్యపురి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కాచం సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# తెలంగాణ వీరశైవ జంగమ అర్చక సంక్షేమ సంఘం

# ఆధ్వర్యంలో శ్రీ వేద గురుకుల పాఠశాల ప్రారంభం



హైదరాబాద్, 7 జూన్ (నగర నిజం) :తెలంగాణ వీరశైవ జంగమ అర్చక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 7 జూన్ 2026 ఆదివారం శ్రీ వేద గురుకుల పాఠశాలను ఐదుగురు విద్యార్థులతో ఘనంగా ప్రారంభించారు. వేద సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ గురుకుల పాఠశాల ద్వారా విద్యార్థులకు వేదాలు, ఆగమ శాస్త్రాలు, పూజా విధానాలు, ఆధ్యాత్మిక విలువలను బోధించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు భారతదేశం వేద భూమి, కర్మ భూమి, జ్ఞాన భూమిగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. అనాదికాలం నుంచి ఋషులు, మునులు, గురువుల పరంపర ద్వారా కొనసాగుతున్న వేద జ్ఞానాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆధునిక విద్యతో పాటు వేద విద్యను కూడా అభ్యసించడం ద్వారా విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటారని వివరించారు.సమాజ శ్రేయస్సు కోసం "లోకా సమస్తా సుఖినో భవంతు" అనే వేద సందేశాన్ని ప్రజల్లో విస్తరింపజేయాలనే ఉద్దేశంతో ఈ వేద పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక చైతన్యం పెంపొందించడంలో వేద విద్య కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా వేదాభ్యాసం అందుబాటులోకి తీసుకురావడానికి సంఘం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు వీరయ్య స్వామి, వీరశైవ ఆగమ సలహాదారులు, పురాణ మఠం నాగయ్య స్వామి, శివగీత ప్రచార సంస్థ పీఠాధిపతి శివ శ్రీ సత్యేంద్ర సోమేశ్వర స్వామి, ఎం. శివశంకర్ స్వామి, ఏ. సురేష్ స్వామి, ఎం. ఫణీధర్ స్వామి, ఎం. బసవరాజ్ అర్చకులు హాజరై ఆశీర్వచనాలు అందించారు. వేద విద్యను అభ్యసించేందుకు చేరిన నూతన విద్యార్థులకు స్వాగతం పలికి వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించారు.భక్తులు, అర్చకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వేద సంప్రదాయ పరిరక్షణకు ఈ గురుకుల పాఠశాల ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని విద్యార్థులను చేర్చుకొని వేద విద్య విస్తరణకు కృషి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.